

కొండలరాయుని చరిత్ర

దట్టమైన అడవులకు నిలయంగా ఉన్న ఖానాపూర్ ప్రాంతానికి ఘనమైన చరిత్ర ఉంది. కొండలరాయుని చరిత్ర అడవిలోనే మరుగున పడుతోంది. 8లో▸



గడువులోగా పూర్తి చేయాలి

పథకాల లబ్ధిదారుల కోసం చేపట్టిన సర్వే ఈనెల 20లోపు పూర్తిచేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. లింబా(కె), కుంటాలలో సర్వేను పరిశీలించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
29.5 /14.4

వాతావరణం

వాతావరణం పొడిగా, ఎండగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత సాధారణంగా నమోదవుతుంది. రాత్రి ఉష్ణోగ్రత తగ్గుతుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

- డీపీవో శ్రీనివాస్



సర్వేను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డీపీవో శ్రీనివాస్ తెలిపారు. కుంటాలలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. లబ్ధిదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు. వారి వెంట ఎంపీవో ఎంఏ.రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, జూనియర్ అసిస్టెంట్ వినోద్ తదితరులు ఉన్నారు.

సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: ప్రిన్సిపల్ సెక్రెటరీ జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఎస్‌డబ్ల్యూ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ ఆదేశాల మేరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ 2024–25 సంబంధించి జిల్లాలో ఆసక్తిగల ప్రభుత్వ ఉద్యోగులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అథ్లెటిక్స్, క్రికెట్, చెస్, క్యారం, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, ఖోఖో, యోగా, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో నైపుణ్యం ఉన్నవారు సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని యువజన క్రీడల శాఖ కార్యాలయంలో ఈనెల 20వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు. ఇతర సమాచారం కోసం 9849913071, 7013396536 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు విధిగా హాజరయ్యేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని డీఈవో రామారావు సూచించారు. పట్టణంలోని బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌ను శనివారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల అన్ని సబ్జెక్టులకు సంబంధించి పునఃశ్చరణ చేస్తూ ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు గైర్హాజరు కాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రతీరోజు స్లిప్ టెస్టులు, వీక్లీ ప్రాక్టిస్ టెస్టులు నిర్వహించాలన్నారు. అంతకుముందు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో ప్రేమ్‌సాగర్, హెచ్‌ఎం సంధ్యారాణి ఉన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



శక్తి సెంటర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మెప్మా పీడీ సుభాష్

నిర్మల్‌చైన్‌గేట్: మహిళలు స్వశక్తితో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ఆర్థికంగా ఎదగాలని మెప్మా పీడీ సుభాష్ అన్నారు. ఈడీఐఐ, యాక్సెంచర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఏర్పాటుచేసిన హౌస్ హోల్డ్ సప్లస్ కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బులు, డిటర్జంట్ పౌడర్, ఫినాయిల్, డిష్‌వాష్ లిక్విడ్, వాషింగ్ మిషన్ లిక్విడ్‌పై ట్రైనింగ్ తీసుకున్న మహిళల కోసం ఈ సెంటర్ ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాపారులుగా ఎదగాలన్నారు. ఈడ్‌గామ్ కౌన్సిలర్ రమ్య విజయ్, మాజీ కౌన్సిలర్ అయ్యన్నగారి శ్రీనివాస్, ఆర్పీ మమత, హాపీజా, ఈడీఐఐ మాస్టర్ ట్రైనర్స్ రవి, అలేఖ్య, దేవేందర్ పాల్గొన్నారు.

వామ్మో.. వలపు వల!

- జిల్లాలో పెరుగుతున్న హనీ ట్రాప్ ఘటనలు
- లైవ్‌లో రెచ్చగొట్టి.. అన్నీ రికార్డు చేసి..
- డబ్బులు డిమాండ్ చేస్తున్న సైబర్ ముఠాలు



జిల్లాకు చెందిన బబ్లూ(పేరు మార్చాం) ఇటీవల తన సెల్‌లో ఏదో చూస్తుండగా.. వాట్సప్‌లో ఓ మెస్సేజ్ లాంటిది స్క్రీన్‌పై వచ్చింది. 'హాయ్.. మైనేమ్ ఈజ్ లిజీ(పేరు మార్చాం). వాట్ ఈజ్ యువర్ నేమ్. వేర్ ఆర్ యు ఫ్రమ్. ఐ యామ్ సింగిల్...' అంటూ కనిపించింది. ఇదేదో డిఫరెంట్‌గా ఉంది.. ఎందుకులే అని మొదట్లో పట్టించుకోలేదు. మరోసారి ఇదే మెస్సేజ్‌తోపాటు ఈసారి ఓ అందమైన అమ్మాయి ఫొటో వచ్చింది. కొత్తగా ఉండటం, అందమైన అమ్మాయి ఫొటో కనిపించడంతో బబ్లూ 'చూద్దాం.. ఏమంటుందో..' అని క్లిక్ చేశాడు. ఒకట్రెండు ముచ్చట్లు చాట్ చేశాడు. తర్వాత అవతలి యువతి నుంచి 'వీడియో కాల్ చేస్తాను..' అని మెస్సేజ్ వచ్చింది. వెంటనే వాట్సప్ వీడియోకాల్ వచ్చింది. లిఫ్ట్ చేయగానే.. అందమైన యువతి లైన్‌లోకి వచ్చింది. 'హాయ్.. బబ్లూ..' అంటూ స్వీట్‌గా మాటలు కలిపింది. కాసేపటికే ఆమె అసభ్యకరంగా మాట్లాడటం, దుస్తులు తొలగించడం చేసింది. తనను కూడా అలాగే చేయాలని చెప్పడంతో.. ఏమాత్రం ఆలోచించకుండా తాను దుస్తులన్నీ తీసేశాడు. అంతే.. 'బాయ్..' అంటూ సెకన్లలోనే వీడియో కాల్ కట్ చేసింది. 'అరె.. ఏంటిది..' అని బబ్లూ తన దుస్తులు సర్దుకునేలోపే తన వాట్సప్‌కు ఒక వీడియో వచ్చింది. దానిని చూసిన బబ్లూ షాక్ అయ్యాడు. అప్పటి వరకు మాట్లాడిన, దుస్తులు విప్పేసిన వీడియోకాల్ మొత్తం రికార్డు చేసి పంపించారు. ఆ వెంటవెంటనే తనకు మెస్సేజ్‌లు వచ్చాయి. 'నువ్వు వెంటనే మా నంబర్‌కు రూ.50 వేలు పంపించు. లేదంటే ఈ వీడియో మీ ఫ్రెండ్స్, మీ కుటుంబ సభ్యులందరికీ పంపిస్తాను. సోష ల్ మీడి యాలలో పోస్టు చేస్తాను. వెంటనే డబ్బు పంపించు.. లేదంటే.. అంతే సంగతి..' అంటూ వరుస మెస్సేజ్‌లు వస్తూనే ఉన్నాయి. దీంతో బబ్లూ గొంతెండిపోయింది. ఒక్కసారిగా కాళ్లుచేతులు వణకడం మొదలయ్యాయి. ఏం చేయాలో.. ఎవరికి చెప్పుకోవాలో.. తెలియక చాలాసేపు కంగారుపడ్డాడు. చివరకు మిత్రుడి సలహాతో పోలీసులను సంప్రదించాడు.

నిర్మల్: ఇటీవల జిల్లాలో చాలామంది యువకులు, మధ్యవయస్కులకు వరుసగా 'హనీట్రాప్' కాల్స్ వస్తున్నాయి. అందమైన అమ్మాయిలతో వలపు వల విసిరి ట్రాప్ చేస్తున్నారు. కూర్చున్న దగ్గర నుంచే, కేవలం సెల్‌ఫోన్‌లలోనే రకరకాల ఎత్తుగడలతో బ్యాంకు ఖాతాలు కొల్లగొడుతున్న సైబర్ ముఠాలు ఇలాంటి ఉచ్చులనూ బిగిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాయి. జిల్లాలో గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగినా.. ఇటీవల మళ్లీ ఫిర్యాదులు వస్తున్నాయి. ఇందులో కొందరే పోలీసులను సంప్రదిస్తున్నారు. చాలామంది బయటకు చెబితే తమ పరువు ఎక్కడ పోతుందోనని కుమిలిపోతున్నారు. తాజాగా జిల్లాకేంద్రంలో ఇద్దరు యువకులకు ఇలాంటి పరిస్థితే ఎదురైంది.

సోషల్ మీడియా ద్వారానే..

టెక్నాలజీని వాడుకుని దోచుకుంటున్న సైబర్ ముఠాలు సోషల్ మీడియా నుంచే తమ టార్గెట్లను ఎంచుకుంటున్నాయి. ప్రధానంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలలో ప్రొఫైల్‌ను చూస్తున్నాయి. సదరు వ్యక్తికి సంబంధించిన పూర్తివివరాలను అంచనా వేస్తున్నాయి. డబ్బులు ఉండి, తమ బుట్టలో పడుతాడనుకునే వారిని ఎంచుకుంటున్నారు. మరికొన్ని ముఠాలు అడల్ట్ సైట్లను చూసేవారిని టార్గెట్ చేస్తున్నాయి.

రెచ్చగొడుతూ.. ఉచ్చుబిగిస్తూ..

హనీట్రాప్ ముఠా సభ్యులైన యువతులు వీడియో కాల్‌లో స్వీట్‌గా మాట్లాడుతూ.. తమ దుస్తులను ఒక్కొక్కటిగా తొలగిస్తూ రెచ్చగొడుతూ.. ఎదుటి వ్యక్తిని మెల్లగా ఉచ్చులోకి దింపుతున్నారు. తమకు కావాల్సిన వివరాలన్నీ తీసుకుంటున్నారు. తాము టార్గెట్ చేసిన వ్యక్తి మొత్తం బట్టలు విప్పేసే వరకూ చూసి కాల్ కట్ చేస్తున్నారు. ఇదంతా స్క్రీన్ రికార్డర్‌తో రికార్డు చేస్తున్నారు. ఆతర్వాత వెంటనే వాట్సప్‌కు ఆ వీడియోను పంపిస్తున్నారు. సదరు యువతులను ముందుపెట్టి నడిపిన ముఠా సభ్యులు రంగంలోకి దిగి డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అడిగిన మొత్తం ఇవ్వకపోతే ఈ వీడియో మొత్తం యూట్యూబ్, సోషల్ మీడియాలో అందరికీ పంపిస్తామంటూ బెదిరిస్తున్నారు.

యువతే లక్ష్యంగా...

జిల్లాలో ఇటీవల బయటకు వచ్చిన హనీట్రాప్ ఘటనల్లో ప్రధానంగా యువతనే లక్ష్యంగా చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. బాధితులంతా దాదాపు 20 నుంచి 28 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఉంటున్నారు. ఇందులోనూ పెళ్లికాని వాళ్లు, పెళ్లికి దగ్గరి వయసులో ఉన్నవారినే సదరు ముఠాలు టార్గెట్ చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇలాంటి వారైతేనే.. పెళ్లి కావాల్సిన వయసులో ఇలాంటి వీడియోలు బయటకు వస్తే తమ పరువు పోవడంతోపాటు పెళ్లికి ఇబ్బంది అవుతుందన్న భయంతో ఎంత అడిగితే అంత డబ్బు ఇస్తారన్న ఉద్దేశంగా కనిపిస్తోంది.

బయటకు రాలేక..

పోలీసులకు కాల్ చేసిన, ఫిర్యాదు చేసినా వెంటనే మీ స్నేహితులు, బంధువులందరికీ ఈ వీడియోలు షేర్ చేస్తామని సదరు హనీట్రాప్ ముఠాలు హెచ్చరిస్తుండటంతో చాలామంది భయపడుతున్నారు. గుట్టుగా ఎంతోకొంత డబ్బులు ముట్టచెప్పిన వారూ ఉన్నట్లు తెలుస్తోంది. పెళ్లయిన వారూ ఎక్కడ తమ బండారం భార్యకు తెలిసిపోతుందోనన్న భయంతోనూ డబ్బులు ఇస్తున్నట్లు సమాచారం. కానీ.. ఇలాంటి ముఠాలు ఒక్కసారి డబ్బు తీసుకోవడంతోనే వదిలిపెట్టవని, తరచూ ఆ వీడియోలు చూపుతూ అడుగుతూనే ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ఘటనలపై వెంటనే సమీప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

1930కు ఫిర్యాదు చేయాలి..

ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. వీటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. తమకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెస్సేజ్‌లు, ఫోన్, వాట్సప్ కాల్స్‌కు స్పందించొద్దు. సైబర్‌క్రైమ్ ఉచ్చులో పడ్డ వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. – జానకీషర్మిల, ఎస్పీ

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు


నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం నూతనంగా అమలు చేయబోవు ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు(రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను అర్హులందరికీ అందించాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లబ్ధిదారుల గుర్తింపునకు పకడ్బందీగా సర్వే చేయాలన్నారు. గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి లబ్ధిదారుల వివరాలను వెల్లడించాలన్నారు. ఈ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఏవో అంజిప్రసాద్, డీసీఎస్‌వో కిరణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీట్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: నిరుద్యోగ యువకులకు ఉద్యోగ కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన డీట్ యాప్‌లో కళాశాలల విద్యార్థులు పేర్లు నమోదు చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ జిల్లా కమిటీ సభ్యులతో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ఈ యాప్‌లో నమోదు చేసుకున్న జిల్లా నిరుద్యోగుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ కల్పనలో డీట్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అధికారులు ఈ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. నిరక్షరాస్యులు కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఈ యాప్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగులు ఇచ్చిన సమాచారం క్రోడీకరించుకుని యాప్‌లో ఆన్‌లైన్ రెజ్యూమ్‌ను పొందుపరుస్తుందన్నారు. ఆ సమాచారం ఆధారంగా కంపెనీలు నిరుద్యోగులను సంప్రదిస్తాయని తెలిపారు. ఇందులో తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా నైపుణ్యానికి తగ్గ వేతనం లభిస్తుందన్నారు. పలు కంపెనీల్లో ఖాళీలను డీట్ యాప్‌లో పొందుపరుస్తాయన్నారు. డీట్ యాప్ నిరుద్యోగులకు కంపెనీలకు మధ్య వారధిలా పని చేస్తుందని తెలిపారు. నిరుద్యోగులకు అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్ సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాకు చెందిన ప్రజలు అనధికారిక ఏజెంట్ల ద్వారా ఇతర దేశాలకు ఉపాధి కోసం వెళ్తే వారి వివరాలను కుటుంబ సభ్యులు కార్మిక శాఖ కార్యాలయంలో వారి ఆధార్ కార్డుతో ఈనెల 26వ తేదీలోపు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9866072044 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, సీపీవో జీవరత్నం, మెప్మా పీడీ సుభాష్, జిల్లా కార్మిక అధికారి ముత్యంరెడ్డి, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతో నేరాలకు చెక్

- ఎస్పీ జానకీ షర్మిల



మొబైల్ ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: నూతన టెక్నాలజీలతో నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ఫోన్లు దోహదపడతాయని జిల్లా ఎస్పీ జానకీషర్మిల అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో డీజీపీ తెలంగాణ ద్వారా ఆమోదించబడిన ఈ సాక్ష (అడ్వాన్స్‌డ్ – ఇన్వెస్టిగేషన్)యాప్ కోసం రెండు మొబైల్ ఫోన్లు, 128 జీబీ మైక్రో ఎస్డీ కార్డ్‌లను జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ మొబైల్ ఫోన్‌లోని సాక్ష యాప్‌లో నేరానికి సంబంధించిన సాక్ష్యాలు చెదిరిపోకుండా భద్రంగా ఉంటాయన్నారు. ఇందులో నేరాలకు సంబంధించిన వివరాలను తేదీల వారీగా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ రికార్డు చేసి పొందుపరచడం జరుగుతుందన్నారు. దీంతో నేరస్తులకు తొందరగా శిక్షలు పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నూతన సాంకేతిక టెక్నాలజీ వినియోగంలో నిర్మల్ పోలీసులు దూసుకెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో నిర్మల్ ఏఎస్పీ ఉపేంద్రారెడ్డి, అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

చిట్యాలలో దారుణం

- 12 ఏళ్ల బాలుడి హత్య
- మర్మవయవాలపై కొట్టి చంపేశారు
- సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ
- ఘటనా స్థలం పరిశీలన..
- క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాల సేకరణ



అడిగెల రిషి(ఫైల్)



బాలుడి తల్లితో మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌రూరల్: ఆ బాలుడి తండ్రి నాలుగేళ్ల క్రితం మరణించాడు. తల్లి భూదేవి కూలీ పనులు చేస్తూ కొడుకును పోషిస్తోంది. బాలుడు కూడా తల్లికి చేదోడుగా ఉండేందుకు సెలవు రోజుల్లో పనులు చేస్తున్నాడు. సంక్రాంతి సెలవులు నేపథ్యంలో గ్రామ శివారులోని కల్లు బట్టీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. శనివారం వేకువజామున బహిర్భూమికి వెళ్లిన గ్రామస్తులు గమనించి తల్లికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్పీ జానకీ షర్మిల కథనం ప్రకారం.. నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన అడిగెల రిషి అలియాస్ ప్రశాంత్(12) గ్రామ శివారులోని కల్లు బట్టీలో పనిచేస్తున్నాడు. రోజులాగానే శుక్రవారం పనికి వెళ్లాడు. రాత్రి పొద్దుపోయే వరకు అక్కడే పనిచేశాడు. రాత్రి ఇంటికి రాలేదు. కొడుకు కోసం ఎదురు చూసిన తల్లి దుకాణంలోనే పడుకుని ఉంటాడని భావించింది. కానీ, శనివారం వేకువజామున గ్రామస్తులు ఆమెకు షాకింగ్ వార్త చెప్పారు. రిషి గ్రామ శివారులో హత్యకు గురయ్యాడని తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. తల్లి గుండెలు బాదుకుంటూ ఘటనస్థలికి చేరుకుంది. ఇంతలోనే పోలీసులు కూడా అక్కడకు వచ్చారు. ఎస్పీ జానకీ షర్మిల ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మర్మాంగాలపై బండరాళ్లతో కొట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఎస్పీ బాలుడి తల్లితో మాట్లాడారు. తన కొడుకు అమాయకుడని, ఎవరో చంపేశారని బోరున విలపించింది. అనంతరం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఘటన స్థలంలో వేలి ముద్రలు కూడా సేకరించారు. డాగ్ స్క్వాడ్ గ్రామంలోని ఓ ఇంటి ముందు ఆగింది. దీంతో పోలీసులు ఆ ఇంట్లోని వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. మరోవైపు గ్రామ శివారులోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీ రాజేశ్‌మీనా, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై లింబాద్రి ఉన్నారు.

నిరీక్షణ ఫలించే తరుణం..

- కొత్త రేషన్‌కార్డులకు గ్రీన్ సిగ్నల్..
- సమగ్ర సర్వే ఆధారంగానే అర్హుల ఎంపిక
- కొనసాగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన



భైంసాటౌన్: కొత్త రేషన్ కార్డుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారి నిరీక్షణ ఫలించే తరుణం ఆసన్నమైంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26 నుంచి కొత్త కార్డులు జారీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగానే అర్హుల ఎంపిక కోసం ఈనెల 16 నుంచి అధికారులతో క్షేత్రస్థాయి సర్వే చేపడుతోంది. కాగా, ఏ ప్రాతిపదికన జారీ చేస్తారనే విషయమై సస్పెన్స్ నెలకొంది. దాదాపు పదేళ్లుగా ఎంతోమంది కొత్త కార్డులతోపాటు మార్పులు, చేర్పుల కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ప్రజాపాలన పేరిట ఆరు గ్యారెంటీలతోపాటు కొత్త రేషన్‌కార్డుల కోసం తెల్ల కాగితంపై దరఖాస్తులు స్వీకరించింది. కానీ, ఇవేవీ కాకుండా ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగానే అర్హుల జాబితా రూపొందించింది. ఆ డేటా ఆధారంగానే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

జిల్లాలో 17,491 కొత్తకార్డులు..!

ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణన సర్వేలో అధికారులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు లేని వారి వివరాలు సైతం నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం కొత్త రేషన్‌కార్డుల జారీకి సమగ్ర సర్వేలో సేకరించిన డేటా ఆధారంగా అర్హుల జాబితా రూపొందించిన ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు పంపింది. ఇందులో భాగంగా జిల్లాలో 17,491 దరఖాస్తులు పరిశీలన చేయాలని సూచించింది.

మార్పులు, చేర్పులకూ అవకాశం..

కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి ఎంపీడీవోలకు పైనుంచి అందిన జాబితా ప్రకారం పంచాయతీ కార్యదర్శులు సర్వే చేపడుతున్నారు. ఇక, పేర్ల చేర్పులు, మార్పులకు సంబంధించి మీసేవ కేంద్రాల్లో ఎంతోమంది దరఖాస్తులు చేసుకోగా, వాటికి ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. జిల్లాలో 41,597 మంది పేర్ల చేర్పు కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో తహసీల్దార్ల నేతృత్వంలో పరిశీలించి, మార్పులు, చేర్పులు చేపట్టనున్నారు.

జిల్లాలో ఇలా...
మొత్తం రేషన్‌కార్డులు 2,08,406
మొత్తం లబ్ధిదారులు 6,39,993
సర్వే కోసం వచ్చిన జాబితా 17,491
మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు 41,597

20 వరకు సర్వే..

కొత్త రేషన్ కార్డుల జారీ కోసం ఈ నెల 16 నుంచి సర్వే కొనసాగుతోంది. 20 వరకు సర్వే పూర్తి చేస్తాం. 21 నుంచి గ్రామసభల్లో ఆమోదం పొందిన తరువాత, డేటా ఎంట్రీ చేపట్టి 25న కలెక్టర్‌కు పంపిస్తాం. కలెక్టర్ లాగిన్ నుంచి సివిల్ సప్లయ్ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీకి వెళ్తుంది. 26 నుంచి ప్రభుత్వం కొత్త కార్డులు జారీ చేస్తుంది. – సీహెచ్.కోమల్‌రెడ్డి, ఆర్డీవో, భైంసా



హాల్‌టికెట్ నంబర్లు వెతికిస్తున్న తల్లిదండ్రులు..

ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష

నిర్మల్ రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులను గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లా కేంద్రంలో 2 పరీక్ష కేంద్రాలు భైంసాలో 3, ఖానాపూర్‌లో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,479 మంది విద్యార్థులకు 1,310 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 169 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో జరిగే పరీక్షను డీఈవో రామారావు, విజయ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా పరీక్షల సహాయ అధికారి సిద్ధ పద్మ తనిఖీ చేశారు.



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

విస్తృతంగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలి

- ఎయిడ్స్ కంట్రోల్ జేడీ రవికుమార్



రికార్డులు పరిశీలిస్తున్న జేడీ రవికుమార్

భైంసాటౌన్: హెచ్ఐవీ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జాయింట్ డైరెక్టర్, సుఖ వ్యాధుల నియంత్రణ నోడల్ అధికారి డాక్టర్ రవికుమార్ ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ విభాగాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షలు, రిపోర్టులు, రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. హెచ్ఐవీ బాధితులను గుర్తించి, సంబంధిత కుటుంబసభ్యులందరికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పు చేయించుకోవడంతోపాటు వారికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలన్నారు. పాజిటివ్ వస్తే పుట్టబోయే బిడ్డకు ఎలాంటి చికిత్స అందించాలో వివరించారు. అలాగే విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్షయ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి నిర్ధారణ పరీక్షల కోసం రెఫర్ చేయాలని తెలిపారు. ఆయనవెంట ప్రోగ్రాం అధికారి బి.నాగరాజు, కౌన్సిలర్లు విలాస్, మహిపాల్, సతీశ్, ల్యాబ్ టెక్నీషియన్లు సుధాకర్, తౌఫిక్ ఉన్నారు.

క్లుప్తంగా

గంగాజలంతో ఉట్నూర్‌కు మెస్రం వంశీయులు



ఉట్నూర్‌కు చేరుకున్న మెస్రం వంశీయులు

ఉట్నూర్‌రూరల్: జిల్లాలోని కేస్లాపూర్‌లో నిర్వహించే నాగోబా జాతరకు మెస్రం వంశీయులు కాలినడకన జన్నారం మండలం కలమడుగు గోదావరి నదికి చేరుకున్నారు. గంగాజలం తీసుకుని తిరుగుపయనంలో శనివారం ఉట్నూర్‌లోని గోండుగూడకు చేరుకున్నారు. మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, యువనాయకుడు జయచంద్ర స్వాగతం పలికారు. వారు కొంతసేపు సేద తీరారు. రాత్రి ఉట్నూర్‌లో బస చేసి ఆదివారం ఉదయం ఇంద్రవెల్లికి బయల్దేరనున్నారు. ఆలయ చైర్మన్ కోసేరావు పటేల్, మెస్రం వంశీయులు ఉన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు ఉజ్వల భవిష్యత్తు



సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: అన్నదాతలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రైతు ఉత్పత్తి సంఘాలు దోహదపడతాయని, వీటికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ట్రికార్ ద్వారా చెక్కులను శనివారం సంఘాల సభ్యులకు అందజేశారు. ట్రికార్ ద్వారా ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, రెబ్బెన మండలాల రైతు ఉత్పత్తి సంఘాలకు రాయితీపై ఒక్కో రైతు ఉత్పత్తి సంఘానికి రూ.7.50 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షల చెక్కులను సభ్యులకు అందించారు. ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్, సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుజాత, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు వినోద్, ప్రశాంత్, ప్రజ్ఞశీల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఖేలో ఇండియా అండర్–17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు హాజీపూర్ మండలం దొనబండ జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.రశ్మిత ఎంపికైంది. గతనెల 21న మంచిర్యాలలో జరిగిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రశ్మిత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం హన్మాండ్లు, పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట జిల్లా వర్గల్‌లో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొంటుందని వివరించారు.

కారడవిలో.. కొండలరాయుని చరిత్ర

- దట్టమైన అడవిలో నిట్టనిలువుగా కొండ
- చుట్టూ రాతి కంచె..
- వెలుగులోకి తెచ్చిన చరిత్రకారుల బృందం
- ఆర్కియాలజీ, పురావస్తు శాఖలు చొరవ చూపితే పర్యాటక శోభ



కొండల రాయుని గుట్టను చూపుతున్న కరిపె రాజ్‌కుమార్

ఖానాపూర్: దట్టమైన అడవులకు నిలయంగా ఉన్న ఖానాపూర్ ప్రాంతానికి ఘనమైన చరిత్ర ఉన్నప్పటికీ కోటను కాపాడి చరిత్రను వెలుగులోకి తెచ్చే వారు లేరు. దీంతో చరిత్ర మరుగున పడే అవకాశం ఉంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం తర్లపాడ్, ఎక్బాల్‌పూర్, సింగాపూర్ గ్రామాల మధ్యలోని దట్టమైన అటవీప్రాంతంలో నిట్టనిలువుగా ఉన్న ఒక పెద్ద గుట్టపైన కొండల రాయుని కోట శిథిలాలు ఉన్నాయి. గుట్ట కింది భాగం నుంచి శిఖరాగ్రం వరకు సుమారు కిలోమీటరు పైనే ఉంటుందని చరిత్రకారులు బృందం సభ్యులు కరిపె రాజ్‌కుమార్, కరిపె రాజశేఖర్, గోండు మధు, చాకలి హన్మంతు తెలిపారు. ఇటీవల అత్యంత శ్రమకోర్చి శిథిల రాతి కంచెను గుర్తించారు. సుమారు పదెకరాల విస్తీర్ణంలో కొండ వ్యాపించి ఉంది. కోటకు మొదట్లో ద్వారపు ఆనవాళ్లు ఉన్నాయి. ఈ దారి వెంబడి పైకి వెళ్తున్న కొద్దీ పెద్ద పెద్ద బేటురాళ్లు అక్కడక్కడ దర్శనమిస్తాయి. ఎత్తైన ప్రదేశాల్లో అంతస్తుల తరహాలో రాళ్లతో పటిష్టంగా నిర్మించిన బురుజులు ఉన్నాయి. ప్రతీ వందమీటర్ల ఎత్తుకు వెళ్లే కొద్దీ ఒక్కో దిక్కులో అనేక బురుజులు కనిపిస్తాయి.

సమాధిలాంటి రాతి నిర్మాణాలు

శిఖరాగ్రంలోని ఆగ్నేయ దిక్కులో ఒక పెద్ద సమాధి లాంటి రాతి నిర్మాణం సుమారు 20 అడుగుల ఎత్తులో నిర్మించి ఉంది. ఈ రాతి నిర్మాణం శిథిలమైనప్పటికీ దీనినే కొండల రాయుడి సమాధిగా చరిత్రకారులు భావిస్తున్నారు. దిగువన పడమటి దిక్కున సైతం కొంచెం చిన్నదిగా అలాంటి మరో నిర్మాణం ఉంది. దీన్ని రాణి సమాధిగా ప్రజలు భావిస్తున్నారు. చుట్టూ కొలత దాదాపు 8 కిలోమీటర్లకు పైగా ఉంది. రాతి కంచె ఎక్కడా కూడా శిథిలం కాలేదు. ఈ మార్గం వెంబడి లోహ పరిశ్రమకు చెందిన ఇనుప చిట్టెంలు, కాల్చిన ఇటుకలు కూడా గుర్తించారు.



గుట్టపై లభించిన కాల్చిన ఇటుక



గుట్టపై లభించిన ఇనుప చిట్టెంలు

ఆర్కియాలజీ, పురావస్తు శాఖ చొరవ చూపాలి

బలుమూరి కొండయ్య 1690–1720 నిజామాబాద్ జిల్లాలోని భీమ్‌గల్ జాగీరు కోసం గోల్కొండ పాలకులతో యుద్ధానికి దిగినట్లు చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతున్నారు. అపజయాన్ని శంకించి భీమ్‌గల్‌లోని పల్లికొండ దగ్గర బాచనపల్లి చిన్నోల్ల గుట్ట మీద ఆత్మహుతి చేసుకున్న కొండల రాయుడి దేహాన్ని ఆయన అనుచరులు కామారెడ్డి దగ్గరలోని వెల్లుల్లపేటలో సమాధి చేశారని మరో కథ ప్రచారంలో ఉంది. వీటన్నింటినీ మరిన్ని వివరాలతో వెలుగులోకి వచ్చేలా పురావస్తు, ఆర్కియాలజీ శాఖలు చొరవ చూపితే ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని చరిత్రకారులు పేర్కొంటున్నారు.

కాకులు దూరని కారడవి..

కాకులు దూరని కారడవిలా ఉన్న ఈ ప్రాంతంలో బహుశా కత్తుల తయారీ జరిగి ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కొండల రాయుడు గుర్రంపైన చాలా వేగంగా ప్రయాణించేవాడని, ఈ ప్రాంత ప్రజలందరికీ ఆరాధ్యుడనే విషయం బొబ్బిలి కథకుల ద్వారా తెలుస్తోంది. కొదుకా..కొండల రాయుడా.. అనే మకుటంతో ఒక స్మృతి గీతం అప్పుడప్పుడు ప్రజల నోళ్లలో ఇప్పటికీ నానుతూనే ఉంది.

చరిత్ర వెలుగులోకి తేవాలి

కొండల రాయుని గురించి ప్రజలు పాడుకున్న జానపద గీతం, బిరుదు తదితర సమాచారం, చరిత్ర పుటల్లోంచి నేటి సమాజానికి తెలిసి వచ్చేలా పురావస్తు శాఖ, ఆర్కియాలజీ శాఖలు, ప్రభుత్వాలు దృష్టిసారించాలి. ప్రముఖ చరిత్ర పరిశోధన బృందంతో కలిసి సమష్టిగా వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది. తద్వారా భవిష్యత్ తరాలకు గత చరిత్రలు తెలియవస్తాయి. – కరిపె రాజ్‌కుమార్, ప్రముఖ చరిత్ర పరిశోధకుడు

ఉదారత చాటిన తోటి కానిస్టేబుళ్లు

- కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2లక్షల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

ఆదిలాబాద్‌టౌన్: తోటి కానిస్టేబుల్ మృతిచెందడంతో కానిస్టేబుళ్లు ఉదారత చాటారు. తమవంతుగా ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకొచ్చారు. 2004 ఏఆర్ బ్యాచ్‌కు చెందిన పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అక్బర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబీకులకు ఉమ్మడి జిల్లా సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు శనివారం రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. మృతుడి భార్య, పిల్లలకు రూ.1.50 లక్షలు, అక్బర్ తల్లిదండ్రులకు రూ.50 వేల నగదు అందించారు. ఆర్‌ఐ డి.వెంకట్, కానిస్టేబుళ్లు కిశోర్, ప్రవీణ్, అజయ్, రాందాస్, ప్రకాశ్, విజయ్, రాజేశ్వర్, ధనరాజ్, సతీశ్, కైలాస్ పాల్గొన్నారు.

హాజీపూర్‌లో అటవీ ప్రాంతాల సందర్శన



గఢ్‌పూర్ అటవీ ప్రాంతంలో ప్రకృతి ప్రేమికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని అటవీ ప్రాంతాలను ప్రకృతి ప్రేమికులు శనివారం సందర్శించారు. చిన్నగోపాల్‌పూర్, గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అటవీ జంతువులను వీక్షించారు. స్వీడన్, లండన్ నుంచి విచ్చేసిన సంగీత కళాకారులతోపాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రకృతి ప్రేమికులు ఉన్నారు.

దైవదర్శనానికి వెళ్తూ కానరాని లోకాలకు

- కోతులను తప్పించబోయి కారు బోల్తా
- బూరుగుపల్లి సమీపంలో ఘటన
- ఇద్దరు అక్కడికక్కడే మృతి.. ముగ్గురికి గాయాలు
- రెండు కుటుంబాల్లో విషాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



సుమిత మృతదేహం



విజయ్ మృతదేహం

మామడ: రెండు కుటుంబాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్తుండగా కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్పూర్‌కు చెందిన సుమిత(53), విజయ్(57), నితిన్, అనిత, సుధీర్ నిరంజన్‌లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనం చేసుకునేందుకు కారులో బయల్దేరారు. మండలంలోని బూరుగుపల్లి సమీపంలో శనివారం రాత్రి జాతీయ రహదారిపై కోతులు వచ్చాయి. డ్రైవర్ బ్రేక్ వేయడంతో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సుమిత, విజయ్‌లు అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ప్రయాణిస్తున్న నితిన్, అనిత, సుధీర్ నిరంజన్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రెండు కుటుంబాల నుంచి ఒక్కొక్కరు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏఎస్పీ రాజేష్‌మీనా, ఎస్సై సందీప్‌లు ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

సైబర్ కేటుగాళ్ల వల

- రూ.10 లక్షల 63 వేలు దండుకున్న వైనం
- కూతురు ఉన్నత చదువు కోసం కన్సల్టెన్సీ పేరిట పంపిన డబ్బులు
- సైబర్ మోసానికి గురైన మాజీ సర్పంచ్



ఆన్‌లైన్‌లో డబ్బులు పంపిన వివరాలు..

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ కేటుగాళ్లు రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతున్నారు. ఏదో విధంగా మాయమాటలు చెప్పి అందినకాడికి దోచుకుంటున్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట వారి ఉచ్చులో పడి అమాయకులు మోసపోతూనే ఉన్నారు. బాధితులు డబ్బులు పోగొట్టుకున్న తర్వాత లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. విద్యావంతులైనప్పటికీ కొందరు వారి మోసాల బారిన పడుతుండడం గమనార్హం. ఇలాంటి సంఘటనే జిల్లాలోని జైనథ్ మండలంలో ఇటీవల చోటు చేసుకుంది. కూతురు ఉన్నత చదువుకోసం కష్టపడి కూడబెట్టుకున్న డబ్బులు సైబర్ మోసగాళ్లకు అప్పగించినట్లు అయింది. తీరా తాను మోసపోయినట్లు తెలిసిన తర్వాత బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నాడు. ఎవరితో చెప్పుకోలేక మానసిక వేదనకు గురవుతున్నాడు. జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం..

ఏం జరిగిందంటే..

జైనథ్ మండల పరిధిలోని ఓ గ్రామ సర్పంచ్ కూతురు డిగ్రీ పూర్తి చేసింది. లండన్‌లో ఉన్నత చదువు కోసం ఓ కన్సల్టెన్సీని ఆశ్రయించారు. దీన్ని ఆసరా చేసుకున్న సైబర్ నేరగాళ్లు బాధితుడి కూతురుకు ఫోన్ చేసి విదేశాల్లో ఉన్నత చదువుల గురించి వివరించారు. తరచూ ఫోన్ చేస్తూ ఆ యూనివర్సిటీ గురించి, అక్కడ ఉండే వసతులు తదితర వివరాలు చెబుతూ నమ్మించారు. లండన్‌లో ఉండాలంటే ముందుగా అద్దె చెల్లించాల్సి ఉంటుందని, అలాగే ఇతర ఖర్చుల కోసం డబ్బులు పంపించాలని చెప్పారు. దీంతో 20 సార్లు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేశారు. డబ్బులు చెల్లించిన తర్వాత నిజమైన కన్సల్టెన్సీ నుంచి ఫోన్ రావడంతో ఒక్కసారిగా కంగుతిన్నారు. విషయాన్ని వారికి చెప్పడంతో సైబర్ మోసానికి గురైనట్లు గ్రహించారు. మొత్తం రూ.10 లక్షల 63 వేలను ఆ కన్సల్టెన్సీకి పంపించారు. వెంటనే 1930కు కాల్ చేయడం ద్వారా రూ.70 వేలు ఆ అకౌంట్‌లో ఫ్రీజ్ అయ్యాయి. జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా ఎస్సై పురుషోత్తం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. డబ్బులు పంపించే సమయంలో సరైన వ్యక్తులకు పంపుతున్నామా లేదా అనే విషయాన్ని సరి చేసుకోవాలని, సైబర్ నేరాలకు బలికావద్దని సూచించారు.

ఎడ్లబండిని ఢీకొన్న బైక్

- షెట్‌పల్లి సమీపంలో ఘటన
- తండ్రికి తీవ్రగాయాలు
- చికిత్స పొందుతూ కుమారుడు మృతి



నిఖిల్ మృతదేహం

పెంబి: మండలంలోని షెట్‌పల్లి సమీపంలో శనివారం రాత్రి ఎడ్లబండిని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రి కుమారుడికి తీవ్రగాయాలు కాగా, ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని షెట్‌పల్లికి చెందిన పవర్ రాజు తన కుమారుడు నిఖిల్(6)తో కలిసి బైక్‌పై పెంబికి వచ్చారు. పని ముగించుకొని స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. మరో మూడు నిమిషాల్లో ఇంటికి చేరుతామనుకునే లోపు ప్రమాదం జరిగింది. షెట్‌పల్లి సమీపంలో ఎడ్లబండిని ఢీకొన్నాడు. ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. పవర్ రాజు, నిఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి క్షతగాత్రులను ఆటోలో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిఖిల్ మృతి చెందాడు. పవర్ రాజు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఎచ్‌వో హన్మాండ్లు తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడులు



బెల్లం పానకం స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెజ్జూర్: మండలంలోని లంబాడిగూడ, సలుగుపల్లి, రెబ్బెన గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. 40 లీటర్ల నాటుసారా, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీ చేస్తున్న వారిని తహసీల్దార్ భూమేశ్వర్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్సైలు లోబానంద్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పటిక, బెల్లం పట్టివేత

దండేపల్లి: లక్సెట్టిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని దండేపల్లి మండలం లింగాపూర్, మేదరిపేటలో శనివారం నిర్వహించిన తనిఖీల్లో ప టిక, బెల్లంతోపాటు గుడుంబా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సమ్మయ్య తెలిపారు. లింగాపూర్‌లో బోడ పంచిబాయి వద్ద 2 లీటర్ల గుడుంబా, మేదరిపేటలోని గోలి రమేశ్ కిరాణా షా పులో 95 కిలోల బెల్లం, 10 కిలోల పటికను ప ట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

దాడికి పాల్పడిన ఇద్దరు అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని చేపల మార్కెట్‌లో ఈనెల 15న బీజేపీ నాయకుడు మిట్టపల్లి జయరామారావుపై దాడికి పాల్పడిన ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చేపల మార్కెట్‌లో జయరామారావు చేపలు కొనుగోలు చేస్తుండగా అకారణంగా సంజీవ్, సాయితేజలు అతనిపై దాడి చేశారు. ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్



ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్

తాంసి: భీంపూర్ మండలం గుబిడి శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నలందప్రియ తెలిపారు. గుబిడి శివారులోని పెన్‌గంగ నది వెంట శనివారం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇసుక తవ్వకాలు చేపట్టిన ప్రదేశాలను పరిశీలించారు. పెన్‌గంగ నది ఒడ్డున పంట చేలలో పక్కన అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను గుర్తించారు. 11 చోట్ల నిల్వ చేసిన డంప్‌ల్లో 25 ట్రాక్టర్ల మేర నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.60 వేలు ఉంటుందని పేర్కొన్నారు. పెన్‌గంగ నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఐ రాందాస్, సిబ్బంది ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందాడు. జైనథ్ మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. జైనథ్ ఎస్సై పురుషోత్తం కథనం ప్రకారం.. మండలంలోని రామాయి గ్రామానికి చెందిన టాప్రే అనిల్ (39) చేపల వేట కోసం శుక్రవారం సాయంత్రం పార్డి(కె), రామాయి గ్రామాల సమీపంలోని సాత్నాల వాగు వద్దకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వలలో చిక్కుకుని పార్డి(కె) సమీపంలోని వాగులో పడి మృతిచెందాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆయన కోసం వెతికిన ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం వాగులో శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో కంప్యూటర్ల చోరీ

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సీఐ సైదారావు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మూడు కంప్యూటర్లు చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు చొరబడి కంప్యూటర్ ల్యాబ్ తాళం పగులగొట్టారు. రూ.54 వేల విలువ గల మూడు కంప్యూటర్లకు సంబంధించిన సీపీయూలు, మానిటర్లు, యూపీఎస్‌లు, కీబోర్డు, మౌస్‌లు ఎత్తుకెళ్లారని హెచ్‌ఎం నరేందర్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. చోరీ ఘటన విషయం తెలియడంతో సీఐ సైదారావు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అంతకుముందు క్లూస్‌టీం సిబ్బందితో విచారణ చేపట్టా రు.

వాగు దాటుతూ నీట మునిగి వ్యక్తి మృతి

- మృతుడు మహారాష్ట్ర వాసి



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి(ఆసిఫాబాద్): దైవదర్శనానికి వచ్చి ఒకరు కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. మండలంలోని ఇందాపూర్ వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఇందాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కెరమెరి ఎస్సై విజయ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని దేవాడ గ్రామానికి చెందిన కోట్నాక మారు (30) ఈనెల 16న ఇందాపూర్ సమీపంలో పోతురాజు, ధర్మరాజు జాతరకు వచ్చాడు. 17 వరకు ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో తండ్రి దౌలత్‌రావు బంధువుల వద్ద వాకబు చేయగా కుమారుడు ఆచూకీ దొరకలేదు. అదేరోజు కెరమెరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో ఇందాపూర్ వాగులో మృతదేహం కనిపించినట్లు పలువురు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడు కోట్నాక మారుదని గుర్తించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాయపడిన యువకుడు మృతి



రాజేందర్(ఫైల్)

సెన్నెల: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్(26) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్, దుర్గం శంకర్ సిరిసిల్ల జిల్లా వేములవాడ శివారులో రైతు నవీన్ మామిడితోటలో పని చేస్తున్నారు. ఈ నెల 14న వేకువజామున రాజేందర్, శంకర్ వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి దర్శనం కోసం వెళ్లారు. భగవంత్‌రావునగర్‌లో గంజాయి మత్తులో ఉన్న ఐదుగురు యువకులు వీరిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. చికిత్స పొందుతూ రాజేందర్ మృతిచెందాడు. మృతదేహాన్ని శనివారం రాత్రి కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకువచ్చారు. కాగా, శంకర్ కోలుకున్నాడు.

ఉరేసుకుని రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య



భీమరాజు (ఫైల్)

రామకృష్ణాపూర్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు భీమరాజు (70) శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం..భీమరాజు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. తన భార్య కొన్నాళ్ల క్రితం చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. అటు అరోగ్యం సరిగా లేకపోవడంతో మానసికంగా కలత చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణఎస్సై తెలిపారు.